విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

గురువారం 12 జూన్ 2025 8 పేజీలు

రైతులను పట్టించుకోకపోతే
ఆందోళన ఉధృతం

వైసీపీ అధినేత జగన్

- రైతుల పక్షానే వైసీపీ పోరాటం..
- పర్యటనను అడ్డుకునేందుకు టీడీపీ కుట్ర అంటూ ధ్వజం
- జగన్ పర్యటనలో ఉద్రిక్తత
- గో బ్యాక్ అంటూ తెలుగు మహిళల నిరసన
- టీడీపీ, వైసీపీ మధ్య పరస్పరం చెప్పులు, రాళ్లతో దాడులు
- పలువురికి స్వల్ప గాయాలు
- గాయపడ్డ కానిస్టేబుల్

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు, పొదిలి :

రాష్ట్ర ప్రభుత్వం రైతులను పట్టించుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని తెలుగుదేశం పార్టీ కావాలని పర్యటనను అడ్డుకుంటుందని చిల్లర రాజకీయాలు చేస్తే సహించేది లేదంటూ మాజీ ముఖ్యమంత్రి వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పొదిలిలో పొగాకు రైతులను పరామర్శించేందుకు బుధవారం వచ్చిన జగన్మోహన్‌రెడ్డిని తెలుగుదేశం పార్టీ నాయకులు, మహిళలు అడుగడుగునా అడ్డుకునే ప్రయత్నం చేశారు. వేశ్యల రాజధాని అమరావతి అంటూ సాక్షి టీవీలో వచ్చిన వ్యాఖ్యలకు నిరసనగా పొదిలిలో జగన్మోహన్‌రెడ్డి పర్యటనను తెలుగు మహిళలు అడ్డుకున్నారు. జగన్ గో బ్యాక్ అంటూ ప్లకార్డులు చేతబూని నల్ల బెలూన్స్‌తో నిరసన తెలిపారు.

జగన్మోహన్‌రెడ్డి కాన్వాయ్‌పై గుర్తు తెలియని వ్యక్తులు చెప్పులు విసిరారు. టీడీపీ, వైసీపీ మధ్య పరస్పర రాళ్లతో, చెప్పులతో దాడులు చేసుకున్నారు. ఈ దాడిలో కానిస్టేబుల్‌కు గాయాలు కాగా పలువురు టీడీపీ, వైసీపీ కార్యకర్తలకు స్వల్ప గాయాలు అయ్యాయి. అయినా జగన్మోహన్‌రెడ్డి పర్యటన ముందుకు సాగింది. నేరుగా వేలం కేంద్రం వద్దకు వెళ్లి అక్కడ రైతులతో మాట్లాడారు. వారి కష్టసుఖాలు తెలుసుకున్నారు. అధికారులతో మాట్లాడి రైతులకు వస్తున్న గిట్టుబాటు ధరలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుల గురించి ప్రభుత్వం పట్టించు కోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని రైతుల పక్షాన వైసీపీ పోరాడుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి మిగతా 2 లో ...

కనిగిరిలో మదర్ న్యూ బోర్న్ కేర్ యూనిట్ ప్రారంభం

2లో

మహిళల గౌరవానికి జగన్ అత్యంత ప్రాధాన్యం

3లో

రైతులకు అండగా ఉంటాం

మంత్రులు డోల, గొట్టిపాటి

విశాలాంధ్ర - ఒంగోలు బ్యూరో : రైతులకు అన్నివేళలా తమ ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామి, రాష్ట్ర విద్యుత్ శాఖమాత్యులు గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. జిల్లా వ్యవసాయ శాఖ పొగాకు బోర్డు ఆధ్వర్యంలో బుధవారం త్రోవగుంటలో వేరువేరుగా నిర్వహించిన ఏరువాక పౌర్ణమి కార్యక్రమాలలో వారు పాల్గొన్నారు. ముందుగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొగాకు వేలం కేంద్రం సమీపంలోని పొలంలో నిర్వహించిన ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన రావు, సంతనూతలపాడు శాసనసభ్యులు బి.ఎన్. విజయ్ కుమార్, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్, వైస్ చైర్మన్ బోడపాటి బ్రహ్మయ్య, కార్యదర్శి వేణుగోపాల్, ప్రకాశం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ శ్రీ కామేపల్లి మిగతా 2 లో ...

మోగనున్న బడిగంట

- నేటి నుంచి నూతన విద్యా సంవత్సరం ప్రారంభం
- ఆర్థికభారంతో తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు
- ప్రభుత్వ ఆదేశాలు పాటించని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల :

ప్రభుత్వ ఆదేశాలతో గురువారం నుంచి 2025-2026 విద్యా సంవత్సరం బడిగంటలు మోగనున్నాయి. విద్యార్థుల ఉరుకులు పరుగులు, అలకలు, నిట్టూర్పులు, కేరింతలు మొదలవనున్నాయి. మరోవైపు అటెన్షన్, సైలెన్స్ ప్లీజ్, అందరు చదవాలి, అరవకండి అనే మాటలు నేటి నుంచి తరగతి గదుల్లో వినిపించనున్నాయి. ఇన్నాళ్లు సరదాగా గడిపిన చిన్నారులు వేసవి సెలవులు ముగిసి బడిబాట పట్టనున్నారు. ఓవైపు ప్రైవేటు పాఠశాలలు సకల సౌకర్యాలతో విద్యార్థుల తల్లిదండ్రులను రారమ్మని, రారా రమ్మని స్వాగతం పలుకుతున్నాయి. మరోవైపు పలు సర్కారు బడులు ఇంకా సౌకర్యాల లేమితోనే విద్యార్థులను ఆహ్వానిస్తున్నాయి.ఇప్పటికే ప్రైవేటు స్కూళ్ళు అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేయగా సర్కారు బడులు మాత్రం బూజుబట్టి దర్శనం ఇస్తున్నాయి.మరోవైపు కార్పొరేట్ పాఠశాలలు లక్షల ఫీజులు వసూలు చేస్తున్నా దీనిపై విద్యాశాఖ మాత్రం కిమ్మనకుండా ఉందని తల్లిదండ్రులు వాపోతున్నారు. పరిస్థితులు ఎలా ఉన్నా పిల్లల్ని ఉన్నత చదువులు చదివించు కోవాలని ఆశతో ఆర్థిక భారం మరిచి చిన్నారుల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు సిద్ధమయ్యారు.

- భారంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు :

ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభంలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక ఒత్తిళ్లు తప్పడం లేదు. డొనేషన్లు,స్కూల్ ఫీజులు, పుస్తకాలు, స్టేషనరీ తదితర ఖర్చులతో పేద, మధ్య తరగతి మిగతా 2 లో ...

రైతులకు అండగా ఉంటాం

(మొదటిపేజీ తరువాయి)

సీతారామయ్యలతో కలిసి పాల్గొన్నారు. నాగలితో పొలం దున్ని రైతులకు ఏరువాక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించి రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఏరువాక శుభాకాంక్షలు తెలిపారు. కేంద్రంలో పొగాకు కొనుగోలు జరుగుతున్న తీరును వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ ఒక రైతు బిడ్డగా అన్నదాతల కష్టం తెలిసిన వ్యక్తి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని అన్నారు. వ్యవసాయం కోసం ప్రత్యేక బడ్జెట్ ను కూడా తమ ప్రభుత్వమే తీసుకొచ్చిందన్నారు. అన్నం పెట్టే రైతు సంతోషంగా ఉండాలని ముఖ్యమంత్రి కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ దిశగానే అవసరమైన చర్యలను తమ ప్రభుత్వం చేపట్టిందన్నారు. గతంలో రైతులకు వ్యక్తిగతంగా అండగా ఉండేలా రాయితీపై పరికరాలను తమ ప్రభుత్వం అందించింది అన్నారు. నేడు కూడా రాయితీపై వ్యవసాయ పరికరాలను రైతులకు అందించేందుకు 146 కోట్ల రూపాయలను కేటాయించినట్లు చెప్పారు. మ్యాచింగ్ గ్రాండ్స్ లేని కారణంగా గత ప్రభుత్వంలో నిలిచిపోయిన కేంద్ర ప్రభుత్వ పథకాలను కూడా తమ ప్రభుత్వం స్ట్రీమ్ లైన్ చేసిందన్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని ఈ నెల 20వ తేదీన అమలు చేసి రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చుతామని మంత్రి చెప్పారు. లోగ్రేడు పొగాకును కూడా కంపెనీలు కొనుగోలు చేసేలా చూడాలని పొగాకు బోర్డు చైర్మన్ ను మంత్రి కోరారు. ఇప్పటికే మంత్రులతో కూడిన కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. పొగాకుతో పాటు ఇతర పంటలు సాగు చేస్తున్న రైతులెవరూ కూడా నష్టపోకుండా ధరల స్థిరీకరణ పై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. మంత్రి రవికుమార్ మాట్లాడుతూ గత రెండేళ్లుగా పొగాకు కొనుగోలుదారులు మంచి లాభాలు ఆర్జించారని, ఈ ఏడాది కూడా సాగుచేసిన పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేయాలని అన్నారు. ప్రస్తుతం హై గ్రేడు, మీడియం గ్రేడ్ పొగాకును కొనుగోలు చేస్తున్నారని, లో గ్రేడును కూడా కొనుగోలు చేయాలని ఆయన కోరారు. పొగాకు రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. నల్లబర్లి రకం పొగాకును ఈనెల 16వ తేదీ నుంచి మార్క్ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తమది రైతు ప్రభుత్వం అని, మామిడి, కోకో, ఆయిల్ పామ్ రైతులకు సమస్యలు వస్తే ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆదుకున్నదని చెప్పారు. పొగాకు రైతులకు కూడా దన్నుగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి కూడా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతారని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న సహాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సాంకేతిక పద్ధతులను అమలు చేయడం ద్వారా దిగుబడి పెంచుకోవచ్చని చెప్పారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చటంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని, ప్రకృతి సేద్యం విధానానికి కూడా అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని తెలిపారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు మాట్లాడుతూ రైతులను ఆదుకోవడంలో కంపెనీలు కూడా బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందన్నారు. గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా పంట మొత్తాన్ని కొనుగోలు చేయాలని చెప్పారు. అలాగాకుండా కంపెనీలు తమ ఇష్టం వచ్చినట్లు కొనుగోలు చేస్తామంటే సరికాదన్నారు. స్థానిక పరిస్థితులను కంపెనీలు తమ యాజమాన్యాల దృష్టికి తీసుకువెళ్లాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యే విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వము, బోర్డు తమను ఆదుకోవడం లేదనే అభిప్రాయంలో పొగాకు రైతులు ఉన్నారని వ్యాఖ్యానించారు. ముందుగా పొగాకు బోర్డు, ఐటిసి అవసరమైన చర్యలు తీసుకొని లోగ్రేడ్ పొగాకు కూడా కొనుగోలు చేసేలా చూడాలన్నారు. పొగాకు బోర్డు చైర్మన్ మాట్లాడుతూ ప్రస్తుతం 60 నుంచి 70 మిలియన్ కేజీల లోగ్రేడ్ పొగాకు ఉన్నట్లు చెప్పారు. బోర్డు ఎల్లప్పుడూ రైతుల పక్షమే ఉంటుందన్నారు. లోగ్రేడ్ పొగాకును కూడా కంపెనీలు కొనుగోలు చేసేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమాలలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, ప్రకృతి సేద్యం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి, జిల్లా ఉద్యానశాఖ అధికారి గోపీచంద్, మార్క్ఫెడ్ డి.ఎం. హరికృష్ణ పాల్గొన్నారు.

కనిగిరిలో మదర్ న్యూ బోర్న్ కేర్ యూనిట్ ప్రారంభం

- మదర్ కేర్ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా
- ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి స్వామి

విశాలాంధ్ర - కనిగిరి :

స్థానిక ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, కలెక్టర్ తమీమ్ అన్సారియాలతో కలిసి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి మదర్ న్యూ బర్న్ కేర్ యూనిట్‌ను బుధవారం కనిగిరిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు పుట్టిన ప్రతి బిడ్డకు మెరుగైన వైద్యం, పూర్తి స్థాయిలో ఆరోగ్యాన్ని అందించాలనే ఉద్దేశంతో ప్రారంభించడం జరిగింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మాతా శిశు వైద్యం పట్ల, ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మెరుగైన వైద్య సేవలను ప్రజలకు అందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కమ్యూనిటి హెల్త్ సెంటర్‌లో మదర్ న్యూ బోర్న్ కేర్ యూనిట్‌ను ప్రారంభించు కోవడం సంతోషదాకమన్నారు. మదర్ కేర్ యూనిట్‌ను ప్రారంభించాలని ఆలోచన చేసిన కలెక్టర్ తమీమ్ అన్సారియాను ఆచరణలో పెట్టి దాతల సహకారంతో పాటు తన సొంత నిధులు వెచ్చించి తన సొంత అమరావతి ఆసుపత్రి కన్నా మెరుగ్గా ఈ మదర్ న్యూ బోర్న్ కేర్ యూనిట్‌ను ఏర్పాటు చేసి తన సొంత నిధులతో 6 గురు సిస్టర్స్‌ను నియమించిన శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. లక్నో నుంచి వచ్చి ఈ మదర్ కేర్ యూనిట్ అమలు తీరును పర్యవేక్షిస్తున్న కమ్యూనిటి ఎంపవర్మెంట్ ప్రతినిధులను మంత్రి అభినందించారు. పుట్టిన ప్రతి బిడ్డకు మెరుగైన వైద్యం, పూర్తి స్థాయిలో ఆరోగ్యవంతంగా ఉండాలన్నదే ఈ మదర్ న్యూ బోర్న్ కేర్ యూనిట్ ప్రధాన ఉద్దేశంతో ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందిస్తున్న వైద్య సేవలు పొంది ఆర్థికంగా వెసులుబాటు పొందాలన్నారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, జిల్లా కలెక్టర్, శాసన సభ్యులతో కలిసి వైద్య అధికారులతో సమావేశమై ప్రజలకు వైద్యసేవలు అందించడంలో దిశానిర్దేశం చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సేవల పట్ల ఎవరు నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.వెంకటేశ్వరరావు, డిసిహెచ్ఎస్ డా శ్రీనివాస నాయక్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వెంకటసుబ్బయ్య, ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

ఆందోళన ఉధృతం

(మొదటిపేజీ తరువాయి)

ఏడాది కాలంలోనే రాష్ట్రంలో వందలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. ప్రకాశం జిల్లాలో కొండేపి, పర్చూరులో గిట్టుబాటు ధరలు లేక రైతులు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు ఈ సందర్భంగా గుర్తు చేశారు. రైతాంగ సమస్యలపై ప్రభుత్వాన్ని వైకాపా నిలదీస్తుందని అన్నారు. రాష్ట్రంలో ప్రతి రైతు తాను పండించిన పంటను తక్కువ ధరలకు అమ్ముకోవాల్సిన పరిస్థితి నేడు ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది వైకాపా పాలనలో రైతులకు గిట్టుబాటు ధరలు ఇచ్చామని తెలుపుతూనే పంట సమయంలో రైతులకు రైతు భరోసా క్రింది 15 వేలు బ్యాంక్ అకౌంట్‌లో వేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఏడాది కాలంగా రైతులకు రైతు భరోసాకి స్కీం ఆగిపోయిందని తెలిపారు. మోడి ఇచ్చే ఆరు వేలు కాగా మరో 20 వేలు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందని, ఎన్నికల ముందు చంద్రబాబు నమ్మపలికి రైతులను మరోసారి మోసం చేశారని తెలిపారు. గత ప్రభుత్వంలో ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు నాణ్యతకు ప్రభుత్వమే గ్యారంటీ ఇచ్చిందని ఈ ప్రభుత్వం గాలికి వదిలేసిందని తెలిపారు. ప్రకాశం జిల్లాలో ఈరోజు నా పర్యటనను దృష్టిలో ఉంచుకొని పొగాకు రైతులకు కాస్త రేట్లు పెంచారని గుర్తు చేశారు. హైగ్రేడ్ క్వాలిటీ రూ.280 ఇచ్చారని తెలిపారు. లో గ్రేడ్ పొగాకు కొనే పరిస్థితి లేదని అన్నారు. పొగాకు రైతు ప్రతి ఎకరాకు 80 వేల రూపాయలు నష్టపోయారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో మార్క్‌ఫెడ్ ద్వారా ఆక్షన్ ఫ్లాట్‌ఫాం మీదకు బయర్ల హోదాలో రంగంలోకి దించామని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో రైతులు గిట్టుబాటు ధర కోసం ఎక్కడా ఇబ్బంది పడలేదని ప్రస్తుత పాలనలో అదే గిట్టుబాటు ధరకోసం రోడ్లు ఎక్కి ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ చర్యలు చూస్తుంటే వ్యవసాయం దండగా అనే పదాలు గుర్తుకు వస్తున్నాయని అన్నారు. చంద్రబాబు నాయుడు హయాంలో ఒక్క ప్రకాశం జిల్లాలో ఆరుగురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, ఈ ఏడాది మరో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారని గుర్తు చేశారు. రైతన్న సమస్యలపై వైసీపీ దశల వారీగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తన పర్యటనను కూడా తెలుగుదేశం రాజకీయం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే శివప్రసాద్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు పార్లమెంట్ ఇన్‌ఛార్జి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి, మార్కాపురం మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, మాజీ మంత్రి మేరుగ నాగార్జున, కారుమూడి నాగేశ్వరరావు, ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవి, వైసీపీ అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి, జూపూడి ప్రభాకర్‌రావు, కనిగిరి ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ పాల్గొన్నారు.

మోగిన బడిగంట

(మొదటిపేజీ తరువాయి) కుటుంబాలకు భారంగా మారుతున్నాయి. కొద్దోగొప్పో సంపాదనాపరుల పరిస్థితి ఇలా ఉంటే చాలీచాలని వేతనాలతో కాలం గడిపే అసంఘటిత కార్మికులు, చిరుద్యోగుల పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. ఇద్దరు పిల్లలున్న తల్లిదండ్రులు చదువు కోసం సాధారణ బడ్జెట్ స్కూల్లోనే రూ.లక్షకుపైగా ఖర్చు చేయాల్సి వస్తుందనేది ఫీజుల పట్టికను చూస్తే అర్థమవుతుంది.

- నిబంధనలకు విరుద్ధంగా : కొన్ని ప్రైవేటు స్కూల్స్ నిబంధనలకు విరుద్ధంగా స్టేషనరీ వ్యాపారాలు కొనసాగిస్తున్నాయి. ప్రభుత్వాలు ఎన్నిసార్లు హెచ్చరించిన విద్యాశాఖ అధికారులు చెబుతున్న ఫలితం లేకుండా పోయింది. స్కూల్స్ ప్రాంగణాల్లో పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు,యూనిఫాం, బెల్ట్, టై, డైరీ,షూస్ ఇలా విద్యార్థులకు కావాల్సి సకల సరంజామా బాహాటంగా విక్రయిస్తున్నాయి. కొన్ని స్కూల్స్ అయితే విద్యా సంస్థ పేరుతో ఎంఆర్పీ ధరలను ముద్రించుకుని విద్యార్థులకు అంటగడుతున్నాయి. ఇతర షాపుల్లో కొనుగోలు చేసిన నోట్ పుస్తకాలను అనుమతించబోమని స్పష్టం చేయడంతో విధిలేని పరిస్థితుల్లో అక్కడే కొనుగోలు చేస్తున్నారు. అధికారులు ప్రైవేట్ పాఠశాలలో ఫీజులపై దృష్టి సారించి నియంత్రణ చేసి సామాన్యులకు పేద మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక భారాన్ని తగ్గించాలని కోరుతున్నారు.

మహిళల గౌరవానికి జగన్ అత్యంత ప్రాధాన్యం

- వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే జగన్‌పై దాడికి యత్నం
- జిల్లాలో జగన్ పర్యటన విజయవంతం
- వైసీపీ జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి

విశాలాంధ్ర -ఒంగోలు : రాష్ట్రంలో మహిళలను అత్యంత గౌరవంగా చూసుకునే వ్యక్తులలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ తర్వాత వైయస్ జగన్‌నే అని వైసిపి జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి అన్నారు. ఒంగోలులోని వైసీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బూచేపల్లి మాట్లాడుతూ వైయస్ జగన్ పొదిలి పర్యటన సందర్భంగా జిల్లా నలుమూలల నుండి దాదాపు 50 వేల మంది పొగాకు రైతులు హాజరయ్యారని పేర్కొన్నారు. రైతులు తమ సమస్యలను జగన్కు వివరించారన్నారు. రైతులకు అండగా నిలిచేది వైయస్సార్ పార్టీ నేని ఈ సందర్భంగా పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వం హయాం కాలంలో రైతులకు గిట్టుబాటు ధరలు ఇచ్చేందుకు జగన్ ధరల తిరీకరణ నిధిని ఏర్పాటు చేశారన్నారు. మార్క్ ఫెడ్ ద్వారా గిట్టుబాటు ధరకు రైతుల పంటలను కొనుగోలు చేయించారన్నారు. దాడిలో వైసిపి కార్యకర్తలు, పోలీసులు గాయపడ్డాడని పేర్కొన్నారు. గిట్టుబాటు ధరలు ఇప్పించలేని ప్రభుత్వం పొగాకు రైతులను ఓదార్చేందుకు వచ్చిన జగన్ పై దాడి చేసేందుకు ప్రయత్నించటం హేయమైన చర్య అన్నారు. మార్కాపురం నియోజకవర్గం వైసీపీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు మాట్లాడుతూ మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి జగన్ పర్యటనను అభాసు పాలు చేసేందుకు ప్రయత్నించి భంగపడ్డారన్నారు. జగన్ పర్యటన వద్ద నిరసన తెలిపేందుకు పట్టుమని పదిమంది కార్యకర్తలు కూడా దొరకలేదని ఎద్దేవా చేశారు. అర్ధరాత్రి పొదిలిలో ఎమ్మెల్యే ఎందుకు పర్యటించారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఒంగోలు నియోజక వర్గం వైసీపీ ఇంచార్జ్ చుండూరి రవిబాబు మాట్లాడుతూ గత రెండు నెలల పొగాకు రైతుల సమస్యల పట్ల అలుపెరుగని చేస్తున్నామని పేర్కొన్నారు. వైసిపి సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్చార్జ్ మేరుగ నాగార్జున, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, వైసీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, సంతనూతలపాడు మండల వైసిపి అధ్యక్షులు దుంపా చెంచిరెడ్డి, చీమకుర్తి మండల నాయకులు మన్నం శ్రీధర్, బొట్ల సుబ్బారావు, కటారి శంకర్ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వ ధ్యేయం

కనిగిరి ఎమ్మెల్యే 'ఉగ్ర'

విశాలాంధ్ర-పామూరు రూరల్ : సంక్షేమంతో పాటు మౌలిక వసతులు కల్పించి గ్రామాలను అభివృద్ధి పరచడమే ఎన్డిఏ కూటమి ప్రభుత్వ ధ్యేయమని కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి అన్నారు. మండలంలోని తూర్పు కోడిగుడ్లపాడు, చిలంకూరు, వీరభద్రపురం పడమర కట్ట కింద పల్లి పంచాయతీల పరిధిలో నిర్మించిన సిమెంట్, తారు రోడ్లను కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి బుధవారం సాయంత్రం ప్రారంభించారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు అన్నిటిని అమలు చేయుటకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. గ్రామాల్లో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ పార్టీ పటిష్టతకు కార్యకర్తలు నాయకులు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యారవ రమా శ్రీనివాస్, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు చౌదరి, తూర్పు కోడిగుడ్లపాడు సర్పంచ్ దారపనేని కొండబాబు, చిలంకూర్ సర్పంచ్ మలినేని శ్రీనివాసులు, వీరభద్రపురం పువ్వాడి జయమ్మ, సయ్యద్ అమీర్ బాబు, పడుచు మల్లి ప్రభాకర్ చౌదరి, తిరువీధి జనార్ధన్, పువ్వాడి రామారావు, పువ్వాడి బిల్డర్ వెంకటేశ్వర్లు, గుంటుపల్లి శ్రీనివాసులు పాల్గొన్నారు.

కొండపి తహసీల్దారుగా శ్రీనివాసరావు

విశాలాంధ్ర-కొండపి : కొండపి మండల నూతన తహసీల్దారుగా శీలం శ్రీనివాసరావు బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. శ్రీనివాసరావు నెల్లూరు జిల్లా వివి పాలెం నుండి బదిలీ మీద కొండపి మండల తహసీల్దారుగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల రైతుల సమస్యలు భూముల సమస్యలు వెంటనే పరిష్కరిస్తామన్నారు. రెవిన్యూ సిబ్బంది సైతం రైతుల భూ సమస్యలకు అధిక ప్రాధాన్యత నుంచి వెంటనే వారి సమస్యలు పరిష్కారం చేయాలని వీఆర్వోల సమావేశంలో ఆయన సూచించారు.

కూటమి విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయండి

విశాలాంధ్ర-ముండ్లమూరు : కూటమిపాలన ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా టిడిపి, జనసేన, బిజెపిల ఆధ్వర్యంలో గురువారం మండలంలోని శంకరాపురం గ్రామం నుండి ఉదయం 9 గంటలకు విజయోత్సవ బైక్ ర్యాలీ జరుగుతుందని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కూరపాటి శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. శంకరాపురం గ్రామం నుండి ముండ్లమూరులోని ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శి టిడిపి ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, దర్శి టిడిపి యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ దర్శి నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు పాల్గొంటారని తెలిపారు. కావున మండలంలోనిటిడిపి, జనసేన, బిజెపి పార్టీల నాయకులు, తెలుగుదేశం పార్టీ అభిమానులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం ఇవ్వాలి

విశాలాంధ్ర- వెలిగండ్ల : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మండలంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం 26 వేలుఇవ్వాలని ప్రకాశం జిల్లా సిఐటియు నాయకులు రాయళ్ల మాలకొండయ్య ప్రభుత్వానికి కోరారు. బుధవారం మండలంలోని వెలిగండ్లలో ఫీల్డ్ అసిస్టెంట్ ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రములో ఫీల్డ్ అసిస్టెంట్లకు గత ఎనిమిది సంవత్సరాలుగా జీతాలు పెరగటం లేదని కేవలం 5700 రూపాయలతో కుటుంబాలు బతకలేక ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమ కష్టాలు తీరుతాయని ఫీల్డ్ అసిస్టెంట్లు భావించారు. ఎఫ్ఎలు తమ కుటుంబం సాధారణంగా బతకాలంటే కనీస వేతనం 26 వేలు చెల్లించాలని మేని దేస్ రద్దు చేయాలని ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.

నూతన కమిటీ:

మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది అధ్యక్షులు రెడ్డెం బాలాజీ, ఉపాధ్యక్షులు ఎం మాలకొండయ్య, ప్రధాన కార్యదర్శి చింతకాయల వీరనారాయణ, సహాయ కార్యదర్శి తాళ్లూరి మాల్యాద్రి, కమిటీ సభ్యులు ఉప్పుటూరి తిరుపతయ్యలను ఎన్నుకోవడం జరిగినది.

పొదిలికి తరలిన వైసీపీ శ్రేణులు

విశాలాంధ్ర- వెలిగండ్ల: పొగాకు రైతులకు మద్దతు ధర కల్పించాలని జగనన్న బుధవారం పొదిలి వేలం కేంద్రానికి వస్తున్నందున మండలంలోని వైసీపీ శ్రేణులు జడ్పిటిసి గుంటక తిరుపతిరెడ్డి ఆహ్వానం మేరకు పెద్ద ఎత్తున కార్యకర్తలు వాహనాల్లో తరలి వెళ్లారు వెలిగండ్ల నుండి ఎర్ర బోయిన నాగూర్ యాదవ్, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు పొల్లా సుబ్రమణ్యం, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వర్లు, ఎంపిటిసి పాప బత్తిని నాగేశ్వరరావు, గుడిపాటి పల్లి సర్పంచ్ దంపతులు కటికల వెంకటరత్నం రిబ్కా, సర్పంచ్ తాతపూడి సురేష్ బాబు, జాల్లపాలెం సర్పంచ్ శ్యామల కృష్ణారెడ్డి, దాదా సోమయ్య, కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, బీసీ సెల్ నాయకులు ఎలిక రమణయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షులు గోన జేమ్స్, తదితర నాయకులు కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు.

14 నుంచి విద్యార్థులకు బస్సు పాస్‌లు

విశాలాంధ్ర - కనిగిరి: నూతన విద్యా సంవత్సరంలో విద్యార్థులకు స్టూడెంట్ బస్సు పాసులను ఈనెల 14వ తేదీ శనివారం నుంచి అందజేయడం జరుగుతుందని కనిగిరి డిపో మేనేజర్ మహమ్మద్ సయానా బేగం ఒక ప్రకటనలో తెలియజేశారు. బస్సు పాసులకి సంబంధించిన క్రొత్త సాఫ్ట్ వేర్‌ను అప్డేట్ చేస్తున్నామని ఈ నెల 12,13 తేదీలలో బస్సు పాసులను జారీ చేయడం నిలిపివేయడం జరిగిందన్నారు. తిరిగి యధావిధిగా ఈ నెల 14వ తారీకు శనివారం నుంచి బస్సు పాసులను జారీ చేయనున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని విద్యార్థులు తల్లిదండ్రులు దృష్టిలో ఉంచుకొని 14వ తారీఖున బస్సు పాసుల కొరకు డిపో వద్దకు రావాలని డిపో మేనేజర్ మహమ్మద్ సయానా బేగం తెలియజేశారు.

ఎస్సీ ఎస్టీ కేసు దుర్వినియోగంపై సీఎం, హోంమంత్రి వివరణ ఇవ్వాలి

- దళిత నేత నేలం నాగేంద్రరావు డిమాండ్

విశాలాంధ్ర-ఒంగోలు : అమరావతి మహిళలను అవమానించారంటూ జర్నలిస్టులు కృష్ణంరాజు, కామినేని శ్రీనివాసరావులపై నమోదైన కేసులో ఎస్సీ ఎస్టీ యాక్ట్ వేయటం చంద్రబాబు అధికార దుర్వినియోగానికి నిదర్శనమని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నేలం నాగేంద్రరావు మండిపడ్డారు. బుధవారం స్థానిక సమితి కార్యాలయంలో జరిగిన సమావేశంలో నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ తెనాలిలో దళిత యువకులపై జరిగిన బహిరంగ పోలీసు దాడి ఘటనలో నేరానికి కులం మతం ఉండదన్న హోంమంత్రి అనిత అమరావతి ఘటనలో మహిళలను అవమానించారంటూ ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయించడంపై స్పందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య మాలపోలు శాంత కుమార్ ఎర్ర మౌతు ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

అధికారుల బదిలీలు

విశాలాంధ్ర -తాళ్లూరు: మండలంలో పలువురు అధికారులు బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో నూతనంగా అధికారులు బాధ్యతలు చేపట్టారు. తాళ్లూరు డిప్యూటీ ఎంపీడీఓ సుందర రామయ్యను పామూరుకి బదిలీ చేసారు. హనుమంతుని పాడు నుండి డిప్యూటీ ఎంపీడీఓ హనుమంతరావు తాళ్లూరు డిప్యూటీ ఎంపీడీఓగా బదిలీ అయ్యారు. తాళ్లూరు డిప్యూటీ తహసీల్ధార్ ఇమ్మానియేల్ రాజు ను కనిగిరి ఆర్‌డీఓ కార్యాలయంకు బదిలీ అయ్యారు. ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న జి.ఫణీంద్రను తాళ్లూరు డిప్యూటి తహసీల్దార్‌గా, కనిగిరిలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరావును తాళ్లూరుకు బదిలీ చేసారు. వారు ఆయా స్థానాలలో బాధ్యతలు స్వీకరించారు.

విశ్వభారతీ షైనింగ్ స్టార్స్‌కు అభినందనలు

విశాలాంధ్ర-దొనకొండ: ఈ ఏడాది విశ్వభారతీ విద్యాలయం నుండి ఐదుగురు విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం అందించే షైనింగ్ స్టార్స్ (ప్రతిభా అవార్డు)కు ఎంపికయ్యారు. జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయా చేతుల మీదుగా నలదిమ్ము వెంకట సుబ్బారెడ్డి, పిచ్చాల నందిని, బుక్కే మహేశ్వర నాయక్, కండె వెంకట సుధీర్, షేక్.మహమ్మద్ షా అల్‌హక్ సర్టిఫికెట్, పతకాలు, రూ.20 నగదును అందుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ మల్లెల రామిరెడ్డి, ప్రిన్సిపల్ సుజాత, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు వారిని అభినందించారు.

జగనన్న పోరుబాటకు తరలిన వైసీపీ శ్రేణులు

విశాలాంధ్ర-దొనకొండ: మాజీ సీయం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదిలి పర్యటన సందర్భంగా వైసీపీ మండల కన్వీనర్ కాకర్ల క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని 18 పంచాయతీల నుండి 135 వాహానాల్లో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పొదిలి తరలి వెళ్ళారు. వైసీపీ జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే డా.బూచేపల్లి శివప్రసాదరెడ్డి వారికి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించారు. తరలిన వారిలో మండల కన్వీనర్ కాకర్ల క్రిష్ణారెడ్డి, గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, బత్తుల వెంకటసుబ్బయ్య యాదవ్, కాలూరి అజయ్ రమణ, నూనె వెంకటరెడ్డి, భీమిని వెంకటేశ్వర్లు, కర్నాటి ఆంజనేయరెడ్డి, బండారు రాజు, ఎగ్గోని క్రిష్ణారెడ్డి, యద్దనపూడి జాన్ ప్రకాష్, యామన బాలిరెడ్డి, వజ్రగిరి సొలోమన్ రాణి, గొంగటి పోలిరెడ్డి, సైరాబాను, పాతకోట కోటిరెడ్డి, పొన్నెబోయిన మూర్తెయ్య, షేక్.రసూల్, సయ్యద్ ముజాయిద్, పులిమి శివ,గోనె జాకోబు, కిన్నెర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పొదిలికి తరలిన వైసీపీ శ్రేణులు

విశాలాంధ్ర -తాళ్లూరు : మండలం నుండి వైసీపి జిల్లా అధ్యక్షుడు , దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వైసీపి శ్రేణులు పొదిలి తరలి వెళ్లారు. ప్రతి పంచాయితీ నుండి అధిక సంఖ్యలో వైసీపి నాయకులు, కార్యకర్తలు వాహనాలకు జెండాలను పెట్టి జగన్ నినాదాలు చేస్తూ పర్యటనకు తరలివెళ్లారు.

సమస్యలు పరిష్కారానికి రైతన్న రోడ్డెక్కాల్సిందే..

వడ్డే శోభనాధీశ్వరరావు

విశాలాంధ్ర-ఒంగోలు :
రైతాంగమంతా ఐక్యంగా సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కి పోరాడినప్పుడే రైతు సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ వ్యవసాయ శాఖ మంత్రి వడ్డే సోమనాదీశ్వరరావు పేర్కొన్నారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని రైతు సదస్సు ప్రకాశం జిల్లా అభివృద్ధికి వేదిక ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సదస్సుకు ప్రకాశం జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షులు చుండూరి రంగారావు అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వడ్డే శోభనాధీశ్వరరావు మాట్లాడుతూ ఏ సమస్య అయినా పరిష్కారం ఐక్య పోరాటాల ద్వారా మాత్రమే సాధ్యమవుతుందన్నారు. ఉత్తర భారత దేశ రైతాంగంలో ఉన్న ఐక్యత ఆంధ్రప్రదేశ్లో కొనబడిందన్నారు. పాలకులు రైతన్న కులాల పేరుతో, మతాల పేరుతో, రాజకీయ పార్టీల పేరుతో, ప్రాంతాల పేరుతో విడగొట్టి రైతాంగ సమస్యలు పరిష్కారం కాకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. రైతు నాయకుల పేరుతో కొందరు బ్రోకర్లు కార్పొరేట్ శక్తులకు తొత్తులుగా మారి రైతులను నిలువునా మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బర్లీ పొగాకు రైతులు అనేక రూపాలలో పోరాటాలు చేసి, నిరసనలు చేపట్టి కంపెనీల చేత, ప్రభుత్వం చేత పొగాకు కొనుగోలు చేసేలా పోరాటం చేసి సాధించుకున్నారని ఆనందం వ్యక్తం చేశారు. డబుల్ ఇంజన్ సర్కారు పాలనలో రైతన్నల పట్ల నిర్లక్ష్య ధోరణి కనిపిస్తుందన్నారు. కార్యక్రమానికి మరో ముఖ్య అతిథిగా హాజరైన వ్యవసాయం విశ్వవిద్యాలయం విశ్రాంతర ప్రొఫెసర్ నాగ మోతు వేణుగోపాలరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని రైతాంగ సమస్యలకు ప్రకాశం జిల్లా రైతాంగం దిక్సూచిగా నిలవాలని సూచించారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డే హనుమ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన పంటల భీమా పథకం రైతాంగ సొమ్మును భీమా సంస్థలకు దోచిపెట్టడానికి తప్ప, రైతాంగానికి ఎటువంటి ఉపయోగం లేదన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పెంట్యాల హనుమంతరావు మాట్లాడుతూ రైతాంగానికి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు సబ్సిడీతోపించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి అని పేర్కొన్నారు. రైతు నాయకులు ఫలితాల కోటేశ్వరరావు మాట్లాడుతూ గత ఏడాది వచ్చింది గిట్టుబాటు ధరలతో రైతులు ఇళ్లలో తమ అవసరాలు గడుపుకున్నారని, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోడూరి నాంచారలు మాట్లాడుతూ ఐక్య ఉద్యమాల ద్వారానే రైతాంగ సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె వీరారెడ్డి మాట్లాడుతూ రైతులలో చైతన్యం చెప్పవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రెడ్ స్టార్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భీమవరపు సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరిని ఉద్యమాలలో భాగస్వామ్యం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య రంగ కిసాన్ సంస్థ ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జుజ్జురి జయంతి బాబు, ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకర్ రావు, ఏపీ రైతు సంఘం నాయకులు ఉప్పుటూరి ప్రకాశరావు, జిల్లాకు చెందిన పలు రైతులు, రైతు కూలీలు, పాల్గొన్నారు.

సాగుకు సమాయత్తం ఏరువాక పౌర్ణమి

విశాలాంధ్ర -తాళ్లూరు: వర్షరుతువు ప్రారంభంలో మృగ శిర కార్తేను స్వాగతిస్తూ పౌర్ణమి రోజు రైతులు నాగలితో దుక్కి దున్నటంతో సేద్యపు పనులు ప్రారంభం అవుతాయని తొలకరి వర్షం పడగానే రైతులు విత్తుకోవటం ముమ్మరంగా సాగు పనులు చేపడతారని వ్యవసాయాధికారి ప్రసాద రావు అన్నారు. తూర్పుగంగవరంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా రైతులతో కలిసి దుక్కి దున్ని ఏరవాక పౌర్ణమి వేడుకలు నిర్వహించారు.

పంట మార్పిడి విధానం అనుసరిస్తే లాభదాయకం

పంట మార్పిడి విధానం అనుసరిస్తే లాభదాయకమని కెవికే నోడల్ ఆఫీసర్ మానస అన్నారు. దోసకాయలపాడులో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. భూమి ఆరోగ్యాన్ని కాపాడుతూ ఎక్కువగా సేంద్రీయ ఎరువులు వాడుకోవాలని చెప్పారు. కోళ్ల పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ లెస్లిలియా ప్రిన్స్ మాట్లాడుతూ మిశ్రమ వ్యవసాయంలో బాగంగా కోళ్ల పెంపకం చేయటం వలన రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని చెప్పారు. వ్యాధుల నియంత్రణలో పాటించాల్సిన మేలుకువల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ఉద్యాన విస్తరణ అధికారి స్వర్ణలత, నరసింహం, కోటి రత్నం తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు ప్రభుత్వ లక్ష్యం

డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు :
వైద్య ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖమాత్యులు డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి చెప్పారు. ఒంగోలులోని ప్రభుత్వ సమగ్ర వైద్యశాల(జి.జి.హెచ్) లో నూతనంగా ఏర్పాటుచేసిన తల్లి, నవజాత శిశు సంరక్షణ విభాగాన్ని (ఎం.ఎన్.సి.యు) జిల్లా కలెక్టర్ శ్రీమతి ఏ.తమీమ్ అన్సారియా, స్థానిక శాసనసభ్యులు దామచర్ల జనార్ధన రావు, ఒంగోలు మేయర్ శ్రీమతి గంగాడ సుజాతలతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కంగారు మదర్ కేర్ విధానాన్ని కనిగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో మన జిల్లాలో మొదటిసారిగా అమల్లోకి తెచ్చామన్నారు. అలాంటి సేవలు కలెక్టర్ ఆలోచన, స్థానిక ఎమ్మెల్యే సహకారంతో ఒంగోలు జి. జి.హెచ్.లో కూడా అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. ప్రస్తుతం ప్రారంభించిన ఈ విభాగమే దానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఒంగోలులోని మాతా శిశు వైద్యశాల (ఎం.సి.హెచ్)లో కూడా ఇలాంటి సేవలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఈ సందర్భంగా కలెక్టరుకు సూచించారు. తద్వారా ఒంగోలులో శిశు మరణాలను సాధ్యమైనంతవరకు తగ్గించవచ్చని అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సదుపాయాలను మెరుగుపరుస్తున్నట్లు చెప్పారు. ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా సేవలు అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బరువు తక్కువగా పుట్టిన బిడ్డలకు అత్యవసర వైద్య సేవలు అందించేలా, అదేవిధంగా తల్లితో బిడ్డకు అవసరమైన భౌతిక సంబంధం ఉండేలా కంగారు మదర్ కేర్ విభాగాన్ని ఒంగోలు జి.జి.హెచ్. లో అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రభుత్వ ఆలోచనలు, ఆశయ స్ఫూర్తితో వైద్య సిబ్బంది కూడా పనిచేయాలని ఆయన సూచించారు. ప్రజలకు అవసరమైన అన్ని సదుపాయాలను జి.జి.హెచ్. లో అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఇంచార్జ్ సూపరింటెండెంట్ మరియు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఏడుకొండలు, డిప్యూటీ సూపరిం టెండెంట్ డా.కిరణ్ కుమార్, డా.ప్రభాకర్ రావు, అడ్మినిస్ట్రేటర్ అద్దయ్య, కోఆర్డినేటర్ డా.వేణు గోపాల రావు, డెప్యూటీ డా.చెంచయ్య, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డా.హేమంత్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి శ్రావ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో పంచాయతీలు అభివృద్ధి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : మండలంలోని రామకృష్ణాపురం గ్రామ పంచాయితీ పరిధిలో లక్ష్మీ శ్రీనివాస కాలనీలలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలతో గ్రామ పంచాయితీ రోడ్లకు మహర్దశ పట్టిందన్నారు.గ్రామాలలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్ల నిర్మాణం వలన రవాణా సౌకర్యం మెరుగు పడుతుందన్నారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమాలలో పంచాయితీ కార్యదర్శులు బి.రమేష్ బాబు,శ్రీనివాస రావు, స్థానిక తెలుగుదేశం,జనసేన, భారతీయ జనతా పార్టీల నాయకులు, కార్యకర్తలు, అధికా రులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజ్ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే కొండయ్య

పట్టణంలోని చర్చి కాంపౌండ్ దగ్గర డ్రైనేజీ సమస్యను ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య దృష్టికి స్థానిక ప్రజలు తీసుకువచ్చారు.తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే కొండయ్య మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్,డీఈ రఘురాం,ఏఈ రవికు మార్‌లకు డ్రెయినేజీ మరమ్మత్తు పనులు చెయ్యాలని ఆదేశించారు.వెంటనే అధికారులు పనులు ప్రారంభించారు. డ్రైనేజీ పనులను ఎమ్మెల్యే కొండయ్య పరిశీలించి త్వరితగతిన మరమ్మత్తు పనులు పూర్తిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కౌత రపు జనార్ధన్‌రావు, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే వేగేశన

విశాలాంధ్ర - బాపట్ల : మండ లంలోని ఆసోదివారిపాలెం గ్రామ పంచాయతీ హన్‌మాన్‌నగర్‌లో సిసి రోడ్డును ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ బుధవారం ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సలీమా, ఎంపిడీఓ బాబూరావు, ఈఓపి ఆర్.డి. శ్రీనివాసరావు, ఎఈ మోహన్‌రావు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు కావూరి శ్రీనివాసరెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

ఫోకస్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - కర్లపాలెం : ఫోకస్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని కర్లపాలెం పంచా యతీ సత్యవతిపేటలో రెడ్డి సేవా మిత్ర ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో నిర్వ హించామని డాక్టర్ కిశోర్ తెలిపారు. ఫోకస్ కంటి వైద్యశాల డాక్టర్లు ఉచిత కంటి వైద్య శిబిరంలో 80 మందికి వైద్య పరీక్షలు చేశారు. 30 మందికి కళ్ళజోళ్ళ అవసరం కాగ 40 మందికి శుక్లాల ఆపరేషన్ అవసరం ఉందని వీరిని రేపల్లె ఫోకస్ కంటి ఆసుపత్రికి తీసుకెళ్లి ఆపరేషన్లు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సేవా మిత్ర అధ్యక్షులు నంగు గోవర్ధనరెడ్డి,గ్రామ పెద్దలు ఇనుకుల కేశవరెడ్డి,పిట్టు సాంబ శివారెడ్డి, మున్నం శ్రీనివాసరెడ్డి, బాల రవిమోహన్ రెడ్డి, శీలం శ్రీని వాసరెడ్డి, సమ్మెట గోవర్ధనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పిఎండిఎస్ ప్రేరణా కార్యక్రమం

విశాలాంధ్ర - జె.పంగు లూరు : పిఎండిఎస్ ప్రేరణ కార్యక్రమలో భాగముగా బుధవారం మండలం లోని చందలూరు, టి.కొప్పెరపాడు గ్రామా ల్లో రైతులతో సమావే శాలు నిర్వహించారు. ఈ సదస్సులో వ్యవ సాయ అధికారి డి.సుబ్బారెడ్డి పాల్గొని మాట్లాడుతూ ప్రతి రైతు భూసార పరీక్షలు నిర్వహించి, వాటి ఫలితాల మేరకే పంటలకు ఎరు వులు, పురుగు మందుల వినియోగం చేపట్టాలన్నారు. భూమిని కౌలుకు తీసుకున్న రైతులు సాగుదారు హక్కు పత్రాలు పొందడం ద్వారా ప్రభుత్వం అందజేసే అనేక సదుపాయాలను పొందగలుగుతారన్నారు. అదే విధంగా పంట మార్పిడి విధానం చేపట్టడం ద్వారా చీడ పీడలను నివారించి, అధిక ఫలసాయం పొందవచ్చున్నారు.అన్నదాత సుఖీభవ-పీఎంకిసా పథకం అర్హత పొందిన 7129 మంది రైతుల జాబితా సంబంధిత రైతు సేవా కేంద్రం లాలో వచ్చింది కావున ఆధార్,పొలము పాసుపుస్తకం తీసుకోనివచ్చి మీ పేర్లు పరిశీలించుకొని ఈకేవైసి చేయవలసిందిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ సహాయకులు ప్రియ, సునీత, నాయకులు మురు కొండ సుబ్బారావు, రైతులు పాల్గొన్నారు.

బస్ డిపో గ్యారేజ్‌ను పరిశీలించిన ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ఏపీఎస్ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి బాపట్ల కొత్త బస్టాండ్,బస్సు డిపో గ్యారేజ్‌ను బుధవారం సందర్శించారు. మొట్టమొదటిసారిగా బాపట్లకు విచ్చేసిన ఇండోర్ జోన్ ఆర్టీసీ చైర్మన్‌కు డిపిటిఒ రవికాంత్ డిపో మేనేజర్ బి.శ్రీమన్నారాయణ, సూపెర్వైజర్స్, ఏపీఎస్ఆర్టీసీ సిబ్బంది అసోసియేషన్ నాయకులు ఘన స్వాగతం పలికారు.బస్టాండ్ ఆవరణను, బస్టాండ్ పరిసర ప్రాంతాలలో సందర్శించి, అక్కడి సౌకర్యం గురించి అధికారులను, వర్కర్స్‌ని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా గ్యారేజ్, గ్యారేజీలో లోపల గుంతలు ఉండటం గమనించారు. యూనియన్ నాయకులు వారిని ఘనంగా సన్మానించారు. గ్యారేజ్ ఆవరణంలో మొక్కను నాటి గ్యారేజ్ ఉద్యోగులు,యూనియన్ నాయకులు, అధికారులు డిపో గ్యారేజ్ పరిస్థితులను వివరించారు. కొత్త బస్టాండ్ ఆవరణంలో గ్యారేజ్‌లో గుంతలు ఉన్నందున యూనియన్ నాయకులు కొత్త సిసి రోడ్లు వేయాలని కోరారు. బాపట్ల పరిసర ప్రాంతాల్లో ఆర్టీసీ ప్రయాణికులు సమస్య లను చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు. పర్యాటక పరంగా అభివృద్ధి చెందుతున్న బాపట్ల సూర్యలంకకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుండి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయా లని జిట్టా శ్రీనివాసరావు జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డికి మెమోరాండం అందజేశారు.

నేడు వెల్లలచెరువులో వేంకటేశ్వర స్వామి వార్షికోత్సవం

విశాలాంధ్ర - సంతమాగులూరు : మండలంలోని వెల్లలచెరువు గ్రామంలో వేంచేసియున్న శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపారు. ఆ రోజు వేకువజామున నుంచే స్వామివారికి చక్రస్నానాలు, విశేష అర్చనలు, పచ్చ కర్పూర హారతులతో పాటు ఎదుర్కోలు క్రతువు జరపనున్నట్లు చెప్పారు. అనంతరం శ్రీనివాసుని కళ్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా చేస్తామని పేర్కొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణ, సాయంత్రం స్వామి వారి ఉత్సవమూర్తులతో గ్రామోత్సవం చేపడతామని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి వారి ఆశీస్సులు, తీర్థప్రసాదాలు స్వీకరించాలని కమిటీ వారు కోరారు.

నేడు సామూహిక అక్షరాభ్యాసం

విశాలాంధ్ర - సంతమాగులూరు : ఐసీడీఎస్ సంతమాగులూరు ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తున్నట్లు సీడీపీవో డి.సుధ బుధవారం ప్రకటనలో తెలిపారు. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ఐసీడీఎస్ ప్రాజెక్టు, సంతమాగులూరు కార్యాలయంలో అక్షరాభ్యాసం కార్యక్రమం జరపనున్నట్లు చెప్పారు. ఈ ప్రోగ్రాంలో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, బల్లికురవ, సంతమాగులూరు మండలాల అంగన్వాడీ కార్యకర్తలు హాజరవుతారని పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వంలో రోడ్లకు మహర్దశ : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - వేమూరు : గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలియజేశారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పేరవలిపాలెం,పేరవలి గ్రామాల్లో ఎన్.ఆర్.జి.ఎస్ ద్వారా నూతనంగా నిర్మించిన సిసి రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గ్రామాల్లో రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోలేదని నేడు కూటమి ప్రభుత్వం గ్రామాల్లో అంతర్గత రోడ్లు నిర్మాణం పై దృష్టి సారించిందన్నారు. ఒక్కొక్కటిగా ఇచ్చిన ప్రతి హామీని చంద్రబాబు నాయుడు ప్రభుత్వం నెరవేరుస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ గొట్టిపాటి పూర్ణ కుమారి,పార్టీ నాయకులు దాది లక్ష్మణరావు, ప్రసాదం బసవయ్య,కంచి సీతారామయ్య,దాసరి చిన్న,కుచ్చెళ్ళపాడు సర్పంచ్ గాజుల వెంకటసుబ్బయ్య, టిడిపి నాయకులు బందారు సూరిబాబు, పంచాయతీరాజ్ ఇంజనీర్లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

భార్యపై పెట్రోల్ పోసి హత్య చేసిన భర్త అరెస్ట్

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బాపట్ల మండలం చెరువు జమ్ములపాలెం గ్రామంలో దాసరి సుభాషిణిపై పెట్రోల్ పోసి హత్య చేసిన ఘటనలో నిందితుడైన మృతురాలి భర్త దాసరి హరీష్‌ను అరెస్టు చేసినట్లు బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు తెలిపారు. బుధవారం బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. మృతిరాలు దాసరి సుభాషిణికి 12 ఏళ్ల క్రితం హరీష్‌తో వివాహమైంది. వారికి పదేళ్ల తారక్, ఎనిమిదేళ్ల సాత్విక్ కుమారులు ఉన్నారు. హరీష్ ఆటో డ్రైవర్‌గా మృతురాలు సుభాషిణి కూలి పనులకు వెళుతూ చెరువు జమ్ములపాలెం ఆనంద నగర్ కాలనీలో జీవిస్తున్నారు. మృతురాలు సుభాషిణి పేరుపై ఇటీవల రేషన్ షాపు డీలర్‌షిప్ వచ్చింది. అయితే భర్త హరీష్ చాలాకాలంగా మృతురాలిని మానసికంగా, శారీరకంగా హింసిస్తూ ఉండేవాడు. ఈనెల 8న మృతురాలు ఎవరితోనో ఫోన్లో మాట్లాడుతుందని ఆమె పట్ల ఇరుగు పొరుగు వారు చెడుగా చెబుతున్నారని భార్య సుభాషిణిని అనుమానించిన హరీష్ ఈ నెల 9న ఆమెతో గొడవపడ్డాడు. అనుమానమే పెనుభూతమై విచక్షణ కోల్పోయి మృగంలా మారి అప్పటికప్పుడు జమ్ముల పాలెం పెట్రోల్ బంకు వద్ద పెట్రోల్ తెచ్చి మంచంపై పడుకున్న తన భార్యపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. స్థానికులు 108 ద్వారా బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలిస్తుండగా మార్గమధ్యంలో సోమవారం సాయంత్రం మృతి చెందింది. మృతురాలి తల్లి మేరిమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడు హరీష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపుతు న్నట్లు తెలిపారు. కేసును త్వరితగతిన చేధించిన సిబ్బందిని ఎస్పీ తుషార్‌డూడి అభినందిం చారు. ఈ సమావేశంలో రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఎస్సై ఐ.శ్రీనివాసు పాల్గొన్నారు.

రేపు వీరంగం డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

విశాలాంధ్ర - యద్దనపూడి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ,ఉపాధి కార్యాలయ, సీడాప్ వారి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం వి.యస్.ఆర్.ఏ.ఎమ్ డిగ్రీ కాలేజీ మార్టూరులో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి పి.ప్రణయ్ తెలియచేశారు. ఈ జాబ్ మేళాకు ఐ.సి.ఐ.సి బ్యాంక్,హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్,మాస్టర్ మైండ్స్,గోదావరి ఆంధ్ర కో-ఆపరేటివ్ సొసైటీ,టెక్ మహీంద్రా (బిపిఓ) (హిందీ మాట్లాడే క్యాండిట్లు మాత్రమే)మొదలగు కంపెనీలు హాజరవుతారన్నారు. 250కి పైగా ఖాళీలు ఉన్నాయని, జీతం వారి విద్యార్హతను బట్టి సుమారు రూ. 10,000,20,000ల వరకు ఉంటుందని తెలిపారు. ఈ జాబ్ మేళాకు ఏదయినా డిగ్రీ,బి.ఎస్.సి సైన్స్ గ్రూపుల వారు,18-30 సంవత్సరల వయసు గల నిరుద్యోగ యువతి, యువకులు వారి బయోడేటా లేదా రెస్యూమ్,ఎడ్యుకేషన్ సర్టిఫికేట్స్ జిరాక్స్, ఆధార్ నకలు,పాస్ పోర్ట్ ఫోటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు.మరిన్ని వివరాలకోసం సంప్రదించవలసిన నంబర్లు 7989 697996, 6302764962,అభ్యర్థులు,నైపుణ్యం ఏపీ జి.ఓ.వి.ఇన్ వెబ్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. ఈ జాబ్ మేళాకు హాజరయ్యేవారు తప్పనిసరిగా వారియొక్క ఆధార్‌కి లింక్ అయిన మొబైల్ నంబర్‌ను తీసుకోని రావాలని తెలిపారు. మరిన్ని వివరములకు టోల్ ఫ్రీ నంబర్ 998885 3335,పైన తెలిపిన నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

వ్యక్తిగత ఈకేవైసీ నమోదుకు ఆదేశాలు

విశాలాంధ్ర - సంతమాగులూరు : మండలం పరిధిలోని ప్రతి పౌరుడి వ్యక్తిగత ఈకేవైసీ నమోదు చేయించాలని ఉద్యోగ సిబ్బందిని బాపట్ల జిల్లా గ్రామ, వార్డు, సచివాలయాల నోడల్ అధికారిణి చెరుకూరి విజయలక్ష్మి ఆదేశించారు. బుధవారం సంతమాగులూరు మండల కార్యాలయం సమావేశపు మందిరంలో కార్యదర్శులు, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, డిజిటల్ అసిస్టెంట్లతో సర్వేలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈకేవైసీ విషయంలో అలసత్వం ప్రదర్శించవద్దని సూచించారు. మండలంలోని వలస వాదులను గుర్తించి,వాట్సాప్ ద్వారా లింకు పంపి ఆధార్ ఓటీపీతో స్వ యంగా వారే ఈకేవైసీ చేసుకునే విధంగా అందరికీ అవగాహన కల్పించాలని చెప్పారు. అలాగే తల్లికి వందనం పథకాన్ని లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలను ఎంపీసీఐ మ్యాపింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామ వార్డు సచివాలయం కోఆర్డినేటర్ యశ్వంత్,ఎంపీడీవో జ్యోతి ర్మయి, డిప్యూటీ ఎంపీడీవో శివరామకృష్ణ ప్రసాద్, ఏవో శంకరరావు పాల్గొన్నారు.

సంఘ సభ్యులకు జీవనోపాదులు కల్పించాలి

విశాలాంధ్ర - పర్చూరు : స్వయం సహాయక సంఘ సభ్యులకు జీవనోపాదులను కల్పించాలని జిల్లా బ్యాంకు లింకేజీ విభాగపు అధికారి లక్ష్మణాచారి తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం మండల సమైక్య ఈసీ సభ్యులకు, గ్రామ సంఘం సహాయకురాలుకు సమావేశం జరిగినది.ఆయన మాట్లాడుతూ జీవనోపాదులులో భాగంగా ప్రతి రూపాయి తిరిగి చెల్లించే విధంగా ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగించాలని తెలియజేశారు. ఆర్థిక సంవత్సరంలో ప్రతి మండలంలో క్రెడిట్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా 7 రకాల కార్యక్రమాల గురించి సభ్యులకు అవగాహన కల్పించాలని, గ్రేడింగ్ జరిగే విధంగా ఉం డాలని తెలిపారు. సూక్ష్మ స్థూల వ్యాపారాలు,పాడి గేదెల,గొర్రెలు,మేకలు పెంపకం, కోళ్ల పరిశ్రమ, గడ్డి పెంపకం,సూర్యఘర్ పథకాలలో గ్రౌండింగ్ జరిగే విధంగా చూడాల్సిన బాధ్యత గ్రామ సంఘాల మీద ఉన్నదని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏటీఎం రామకృష్ణ, సీసీలు, వివోఏలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన న్యూఢిల్లీ ప్రతినిధులు

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : మండలంలోని తుమ్మలవైలు, చింతల చెంచు గిరిజన గుడాలలో జాతీయ గ్రామీణ అభివృద్ధిశాఖ, చేపట్టిన పనులను బుధవారం. గ్రామీణ అభివృద్ధి శాఖ న్యూఢిల్లీ ప్రతినిధులు ఉమేష్‌కుమార్ రామ్, జాయింట్ డైరెక్టర్ జి ఎస్ రావత్ పరిశీ లించారు. ఈ సందర్భంగా భారత ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం అందే అన్ని గ్రామీణ అభివృద్ధి శాఖ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఆర్ జి ఎస్ డైరెక్టర్ షణ్ముఖ ,ప్రాజెక్ట్ డైరెక్టర్ జోసెఫ్ కుమార్, తదితర జిల్లా శాఖ అధికారులు ,మండల అధికారులు పాల్గొన్నారు.

మహిళలను కించపరిచే వారిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - కొనకనమిట్ల : అమరావతి రాజధాని మహిళా రైతులపై వైసీపీ అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి సొంత మీడియా సాక్షి టీవీ రిపోర్టర్లు కొమ్మినేని శ్రీనివాసరావు కృష్ణం రాజు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం మండలంలోని కొనకనమిట్లలో టిడిపి ఆధ్వర్యంలో మహిళలు నిరసన ర్యాలీ చేపట్టి బస్టాండ్ సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి సంఘీభావం తెలిపిన మార్కా పురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ ఈఏడాది కొంత ప్రతికూల పరి స్థి తులు కారణంగా పొగాకు రైతులు పొగాకు పంటను ఎక్కువగా పండించాలని అంతర్జాతీయ మార్కెట్లో తగిన గిట్టుబాటు ధర లేకపోవడంతో సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పొది లిలోని పొగాకు బోర్డు కంపెనీ యజమానులతో మాట్లాడి కొనుగోళ్లలో వేగం పెంచేలా చేశామన్నారు. అమరావతి రాజధాని మహిళా రైతులపై జగన్ సాక్షి ఛానల్ రిపోర్టర్లు అమరావతి రాజధాని మహిళలు వేశ్యలని మాట్లాడడం పట్ల పొదిలిలో నిరసన తెలుపుతున్న మహిళా రైతులపై జగన్ కాన్వాయ్‌లో వచ్చిన వైసిపి దుండగులు మహిళ లపై రాళ్లతో చెప్పులతో దాడి చేసి గాయపరచడం హేయమైన చర్య అన్నారు. ఈ సందర్భంగా జగనుకు వ్యతిరేకంగా మహిళలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత కార్య దర్శి కామసాని రామిరెడ్డి, టిడిపి అధ్యక్షుడు ఏం బాబు రావు, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి జవాజి భాషా పతి నాయుడు, టిడిపినాయకులు కే కాశిరెడ్డి భీమాంజనేయరెడ్డి, తాతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి తెలుగు యువత నాయకులు పెరికేసుకుదేవ్ బూన్ మూవ్వా కాటమరాజు పరిటాల సుబ్బయ్యకే సాల్మన్ బాపతి కృష్ణారెడ్డి, కే బొంతయ్య వేంపాటి శ్రీకాంత్ రెడ్డి ముక్కాల శ్రీనివాసులు రెడ్డి ,మండల టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.28 లక్షలతో నిర్మించిన రథశాల ప్రారంభం

విశాలాంధ్ర - యద్దనపూడి : మండలంలోని పూనూరు గ్రామంలో నూతనంగా రూ.28 లక్షల నిధులతో నిర్మించిన రథచాలను టిడిపి నాయకులు నల్లప్పనేని రంగయ్య చౌదరి, రాయపాటి సీతయ్య ప్రారంభించారు. రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ ప్రధాన అర్చకులు దివి భావనాచార్యులు ఆధ్వర్యంలో హోమాలు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ రథశాల నిర్మాణానికి ప్రభుత్వం ఎండోమెంట్ శాఖ నుండి రూ.13 లక్షలకుపైగా విడుదల చేయగా,గ్రామానికి చెందిన దాత రాటకొండ హనుమంతరావు రూ.6 లక్షల 70వేలు నిర్మాణానికి, మరో ఎనిమిది లక్షలు షట్టర్లు నిర్మాణానికి ఏర్పాటు చేసి రథచాలను నిర్మించారు. రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి రథమును గ్రామస్తులు సహాయ సహకారాలతో గత ఏడాది కోటి రూపాయల నిధులతో నిర్మించారు.ఏరువాక పౌర్ణమి సందర్భంగా స్వామివారిని రథంపై గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు . అనంతరం ఈ కార్యక్రమంలో రాటకొండ వరదబాబు, వంకాయలపాటి సుబ్బారావు, ఈరప్పనేని వాసు, బత్తుల రాము, దరువురి వీర య్య చౌదరి, గుమ్మడి సుధీర్, ఈదల రవి, ఈవో జివిఎల్‌కుమార్ పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలలో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, బాపట్ల వ్యవసాయ కళాశాలలో ప్రపంచ రక్త దాతల దినో త్సవం సందర్భంగా కళాశాల లోని హెల్త్ క్లినిక్ వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్ర మం కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఏపీఎస్‌ఎసిఎస్ వారు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి. ప్రసూన రాణి ముఖ్యఅతిథిగా పాల్గొని రక్తదానం మహత్యాన్ని విద్యార్థులకు వివరించారు. మొదటిగా డాక్టర్ పి.ప్రసూన రాణి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.రాజేష్ ఎంబిబిఎస్ ఎండి వైద్య సిబ్బంది పర్యవేక్షణలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ ఎం.రమాదేవి,డాక్టర్ సి.సంధ్యా రాణి, డాక్టర్ జి.విజయ్ కుమార్,డాక్టర్ రవీంద్ర రెడ్డి నిర్వహించారు. కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

కోళ్ల వ్యర్థాలతో చేపల చెరువులు

విశాలాంధ్ర - అద్దంకి : మండలంలోని సింగరకొండ పాలెంలో భవనాసి చెరువు అనుకొని కొందరు చేపల చెరువులు ఏర్పాటు చేశారు. కోళ్ల వ్యర్థాలను చెరువులలో వేసి చేపలను పెంచుతున్నారు.చేపలు త్వరగా పెరిగేందుకు కోళ్ల వ్యర్థాలు వాడుతున్నట్లు తెలుస్తోంది.కోళ్ల వ్యర్థాలతో పెరిగిన చేపలు తినడం వలన ఆరోగ్యం క్షీణిస్తుందని వైద్యాధికారులు సూచనలు చేస్తున్నారు. అధికారులు స్పందించి చేపల చెరువులలో కోళ్లవ్యర్థాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అన్నదాత సుఖీభవ లబ్ధిదారులు బయోమెట్రిక్ చేయించుకోవాలి

విశాలాంధ్ర - అద్దంకి : మండలంలోని అన్నదాత సుఖీభవ లబ్ధిదారులు బయోమెట్రిక్ వేయించుకోవాలని అద్దంకి మండల వ్యవసాయ అధికారి వెంకటకృష్ణ బుధవారం తెలిపారు. అర్హులందరూ ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలలో వ్యవసాయ సహాయకుల వద్ద బయోమెట్రిక్ వేయించుకోవాలన్నారు. బయోమెట్రిక్ వేయించుకొని వారికి అన్నదాత సుఖీభవ అమౌంట్ జమ చేయబడదు అన్నారు. అర్హులందరూ తప్పనిసరిగా బయోమెట్రిక్ వేయించుకోవాలన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర - నిజాంపట్నం : గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని జడ్పీటీసీ సభ్యులు నర్రా సుబ్బయ్య, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బొమ్మిడి రామకృష్ణ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం అయిన సందర్భంగా నిజాంపట్నం గ్రామంలో పూర్తయిన నూతన సీసీ రోడ్లు ప్రారంభోత్సవం అలాగే కొత్త సీసీ రోడ్ల నిర్మాణాలకు బుధ వారం వారు శంకు స్థా పనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి అనగాని సత్య ప్రసాద్ చొరవతో రేపల్లె నియోజక వర్గం అభివృద్ధి పథంలో ముందుకు పోతుందన్నారు. దానిలో భాగంగా మంత్రి అనగాని నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టుతున్నారన్నారు.గత 2014-19 టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న అనగాని సత్యప్రసాద్ ఒక్క నిజాంపట్నం గ్రామానికే సుమారు రూ.15 కోట్లు మంజూరు చేయించి ఎన్నో అభివృద్ధి పనులు చేయించారని గుర్తు చేశారు.అలాగే గత 2014-19 టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న అనగాని సత్యప్రసాద్ నిజాంపట్నం మండలంలోని చెక్కా వారిపాలెం వంతెన-రోడ్డు నిర్మాణానికి అలాగే దర్వేష్‌పాలెం నుంచి గట్టువారిపాలెం మీదుగా పెద్దపల్లి వరకు రోడ్డు నిర్మాణానికి శాంక్షన్ చేయించారని అనం తరం వైసీపీ ప్రభుత్వం రావడంతో ఆ పనులు నిలిచిపోయాయని చెప్పారు.మళ్లీ కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చాక మంత్రి అనగాని సత్య ప్రసాద్ చొరవతో ప్రస్తుతం ఆ పనులన్నీ ప్రారం భమయ్యాయని తెలిపారు. నిజాంపట్నం మండలం లో ఇంకా ఎన్నో అభివృద్ధి పనులకు మంత్రి అన గాని నిధులు మంజూరు చేయించారని చెప్పారు. అలాంటి అభివృద్ధి ప్రధాత అయిన మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు ప్రజలు ఎప్పుడు అండగా నిలవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్య దర్శి మోడి శ్రీనివాసరావు, ఎంపీటీసీ నాజర్ ఖాన్,నీటి సంఘం డీసీ వైస్ ప్రెసిడెంట్ నక్కల పోలిరాజు, టీడీపీ నాయకులు కన్నా మీరయ్య, ఇమ్రాన్ ఖాన్,కీర్తి శీను, కేసన మోహన్‌రావు,నర్రా వెంకటేశ్వర్లు, ఊసవరపు వెంకటేశ్వర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా చింతలపూడి అశోక్ రెడ్డి

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : పెద్ద దోర్నాల మండల తహసిల్దార్‌గా చింతలపూడి అశోక్ రెడ్డి బుధవారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలోని పలు సమస్యలు పరిష్కరించేందుకు. తమ వంతు కృషి చేస్తానని తెలిపారు. గతంలో పనిచేసిన కిన్నెర శాంతి కొత్తపట్నం బదిలీపై వెళ్లగా ఆమె స్థానంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన చింతలపూడి అశోక్ రెడ్డి ని ,దోర్నాల మండల నాయకులు ఎన్ టి యుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బట్టు సుధాకర్ రెడ్డి , మండలంలోని టిడిపి నాయకులు కలిశారు. అలాగే దోర్నాల మండల వీఆర్వోలు తాసిల్దార్ కు షాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో దోర్నాల వీఆర్వోలు ఆనంద రావు, చెన్నయ్య, శ్రీనివాసులు, ఏడుకొండలు, కోటయ్య.. జయప్రకాష్, శామ్యూల్, రవికుమార్, సునీత, ఎస్తేరు రాణి, విఆర్వోలు, రెవిన్యూ సిబ్బంది సన్మానించారు. అలాగే పార్టీ శ్రేణులు శాలువాతో పూలదండలతో ఘన స్వాగతం పలుకుతూ మర్యాదపూర్వకంగా కలిశారు.

సీపీఐ జిల్లా మహాసభల కరపత్రాల ఆవిష్కరణ

విశాలాంధ్ర - త్రిపురాంతకం : దర్శి పట్టణంలో జరుగు సీపీఐ జిల్లా మహాసభలకు సంబంధించిన కరపత్రాలను సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమం సీపీఐ మండల కార్యదర్శి దాసరి మల్లికార్జున ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పూలసుబయ్య వెలుగొండ ప్రాజెక్టును త్వరగా పూరి చేసి నిర్వాశితులకు పునరావాసా కాలానీలు ఏర్పాటు చేసేందుకు తీర్మానం. మార్కాపురం జిల్లాగా భారత కమ్యూనిస్టు పార్టీ ప్రకాశంజిల్లా 17వ మహాసభలు దర్శిలో జరపాలని జిల్లా పార్టీ నిర్ణయించిందని అన్నారు. ప్రకాశంజిల్లా మహాసభలు దర్శిలో జరపడం ఇదే మొదటిసారి అన్నారు. మహాసభల నిర్వహణ ఎంతో వ్యయప్రయాసాలతో కూడినదైయినప్పటికీ రాష్ట్ర జిల్లా స్థాయిలో ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ నిర్మాణ అంశాల తోపాటు జిల్లా సమగ్రాభివృద్ధిపై చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపకల్పనకు "దర్శి" వేదిక కావడం ఆనందంగా ఉన్నదన్నారు.ప్రపంచ కమ్యూ

నిస్టు ఉద్యమాన్ని ఆకర్షించిన తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో గుజ్జుల యల్లమందారెడ్డి. సానికొమ్ము కాశిరెడ్డి, సూరా వీరాస్వామిరెడ్డి కనిగిరి ప్రాంతం నుండి కోటపాటి గురుస్వామిరెడ్డి, చాగంరెడ్డి నరసింహారెడ్డి లాంటి అనేకమంది కమ్యూనిస్టు యోధుల నాయకత్వంలో వెంకటగిరి జమిందారీ వ్యతిరేకపోరాటం సాగించి వేలాది ఎకరాలను రైతులకు పంపిణీ చేయడంతోపాటు దర్శి ప్రాంతంలో ప్రభుత్వ భూముల పంపిణీపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలని గుజ్జుల యల్లమందారెడ్డి. సానికొమ్ము కాశిరెడ్డి, ముట్టా శరభారెడ్డి, జూపల్లి వెంకటసుబ్బయ్య గార్ల నాయకత్వంలో అనేక పోరాటాలు సాగించి, రైతులకు సాగుభూములు పంచిన చరిత్ర ఈ ప్రాంత కమ్యూనిస్టు ఉద్యమానికి ఉన్నది అన్నారు. ప్రకాశంజిల్లా సమగ్రాభివృద్ధి చెందాలని, జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి చెందాలని, జిల్లా యువతకు ఉపాధి అవకాశాలు కోసం దొనకొండ పారిశ్రామిక కారిడార్ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసారు. దర్శిలో సిపిఐ 17వ జిల్లా మహాసభలు జూన్ 21,22,23 తేదీలలో జరువ తలపెట్టామన్నారు. ఈ సభలకు జిల్లా నలుమూలల నుండి అనేక ప్రజా పోరాటాలకు నాయకత్వం వహిస్తున్న నేతలు సుమారు 500 మంది ప్రతినిధులు పాల్గొంటారని అన్నారు.ఈ జిల్లా మహా సభలకు ప్రతి ఒకరు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శులు ఆదినారాయణ, తిరమలయ్య, కాశీం, పవన్‌కుమార్, దాదా, యోగయ్య పాల్గొన్నారు.

స్థలాలను పరిశీలించిన మార్కాపురం సబ్ కలెక్టర్

విశాలాంధ్ర- పెద్దదోర్నాల : దోర్నాల మండలంలోని స్థానిక ఆర్టీసీ బస్టాండ్, స్థలా న్ని, బుధవారం మార్కా పురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ పరిశీలించారు. ముందుగా దోర్నాల సబ్ కలెక్టర్లు దోర్నాల మండల నాయకులు టిఎన్‌టిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బట్టు సుధాకర్ రెడ్డి మండల కన్వీనర్ ఎదవ మల్లికార్జున రెడ్డి, అలాగే పార్టీ శ్రేణులు శాలువాతో పూలదండలతో ఘన స్వాగతం పలుకుతూ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం దోర్నాల మండలం మిర్చి యార్డ్‌లో, డిగ్రీ కళాశాల కోసం స్థలాన్ని, మరియు సోలార్ ప్లాంటేషన్ కి స్థలం కేటాయించే నేపథ్యంలో దోర్నాల పర్యటనకు విచ్చేసిన సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలోతహశీల్దార్ అశోక్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మదన వేణుగోపాల స్వామి రథోత్సవం

విశాలాంధ్ర - పామూరు : మండల కేంద్రమైన పామూరు పట్టణంలో వెలిసిన శ్రీ మదన వేణుగోపాల స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు ఈనెల 5వ తేదీ నుండి వైభవముగా జరుగుతున్నాయి. అందులో భాగంగా రెడ్డి, హరికాపు, వెలమ, యాదవ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 7 గంటల నుండి విశ్వేక్షణ పూజ, పుణ్యవచనం, నిత్య హోమం, హారతులు, ఆలయం చుట్టూ భక్తుల ప్రదక్షణ, 10 గంటల నుండి కేరళ వాయిద్యాలు, కనక తప్పెట్లు, తీన్మార్ డ్రమ్స్, బేతాళ వేషధారణలతో నృత్య ప్రదర్శనలు, కోలాటం బాణాసంచాతో వేలాదిమంది భక్తుల మధ్య స్వామివారి మాడ వీధులలో "రథోత్సవం"అంగరంగ వైభవముగా సాగింది. మధ్యాహ్నం బోయ ళ్ళ నారాయణరెడ్డి వేలాది మంది భక్తులకు అన్న ప్రసాదం మిత్రమజేశారు. రాత్రికి మాదిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. మాజీ మంత్రి బుక్కు కాశిరెడ్డి, ఆది లక్ష్మమ్మ దంపతులు రథోత్సవములో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉదయం నుండి సాయంత్రం వరకు సీఐ భీమా నాయక్ ఆధ్వర్యంలో సేవలందించిన పోలీస్ సిబ్బందికి,విద్యుత్ అధికారులు, సిబ్బందికి ఉభయ దాతలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

13 వరకు సచివాలయంలో ఆధార్ క్యాంప్‌లు

విశాలాంధ్ర - వెలిగండ్ల : మండలంలోని గ్రామ వార్డు సచివాలయాల పరిధిలో ఆధార్ క్యాంపులు ఈనెల 11 నుంచి 13 వరకు నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ బాషా తెలిపారు. బుధవారం మండలంలోని వెలిగండ్ల సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ఆధార్ కార్డులు, ఆధార్ తీసుకుని పదేళ్లు దాటిన వారికి బయోమెట్రిక్ అప్‌డేట్, ఇంటి అడ్రస్, వయసు, పేరు మార్పు, ఫోన్ నెంబరు అప్‌డేట్, ఐదేళ్లలోపు చిన్నారులకు బాల ఆధార్ కార్డులు జారీ వంటి సేవలను ఈ క్యాంపుల్లో అందించనున్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

రేపు జిల్లా సమితి సమావేశం

విశాలాంధ్ర - సంతమాగులూరు : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సం ఘం బాపట్ల జిల్లా సమితి సమావేశం ఈనెల 13న ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అద్దంకి నాగేశ్వరరావు బుధ వారం తెలిపారు.ఆ రోజు ఉదయం 10 గంటలకు బాపట్ల పట్టణంలో ఉన్న సీపీఐ పార్టీ ఆఫీసులో నిర్వహిం చనున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి ఆ సంఘం రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఆర్.వెంకట్రావు అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సమా వేశానికి సమితి సభ్యులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

షిరిడి సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ

విశాలాంధ్ర - పెద్ద దోర్నాల : మండల కేంద్రమైన దోర్నాల్లోని షిరిడి సాయిబాబా మందిరంలో బుధవారం షిరిడి సాయిబాబా నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్ర మాన్ని వేదమంత్రాల మధ్య నిర్వ హించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి వారికి కాయ కర్పూర సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నసంతర్పణ కార్యక్ర మాలు నిర్వహించారు. సాయంత్రం సాయి రాధిని పురవీధుల్లో ఊరేగించారు.

పోసుపల్లె గ్రామంలో క్షుద్ర పూజల కలకలం

విశాలాంధ్ర - కొమరోలు : మండలం పోసుపల్లె గ్రామంలో క్షుద్ర పూజలు కలకలం రేపింది. పోసుపల్లె నుండి సూరవారి పల్లె గ్రామానికి వెళ్లే రహదారిలో నడిరోడ్డుపై గుర్తు తెలియని వ్యక్తులు పసుపు, కుంకుమతో బొమ్మ లను తయారుచేసి క్షుద్ర పూజలు చేసినట్లు అక్కడ దృశ్యాలు దర్శన మిస్తున్నాయి. దీంతో స్థానిక ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

మహిళలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలి

విశాలాంధ్ర - దర్శి : పొదిలిలో పొగాకు రైతుల పరామర్శ అంటూ బుధవారం పులివెందుల శాసనసభ్యులు జగన్మోహన్ రెడ్డి అతని అనుచరులు సైకోలు మహిళలపై బీరు బాటిల్‌తో చేసిన దాడి సభ్య సమాజం తలదించుకునేలా ఉంది. వెంటనే ఈ దాడికి బాధ్యత వహిస్తూ జగన్మోహన్ రెడ్డి మహిళలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలి. ఈ సంఘటనకు బాధ్యులైన జగన్ మోహన్ రెడ్డి పై సైకో అనుచరులపై వెంటనే పోలీస్ శాఖ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలి. ముందుగా పథకం ప్రకారం పొదిలిలో మహిళలపై దాడి చేసి రాష్ట్రంలో మహిళా లోకం తన సాక్షి పేపరు సాక్షి ఛానల్ పై జగన్ పే టిఎం బ్యాచ్ పై గళమెత్తితే మహిళలను బెదిరించే కార్యక్రమంలో భాగంగా దాడిగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి స్పష్టం చేశారు. అసలు రైతులను పరామర్శించేందుకు వచ్చినట్లు లేదు కావాలని మహిళలపై దాడి చేయడానికి వచ్చినట్లుగా అర్థమవు

తుంది. పొగాకు రైతులను ఆదుకునే వారు వారికి ఓదార్పుగా ఉండాల్సింది పోయి జగన్ సైకో బ్యాచ్ పొగాకు మండీలపై తొక్కి విధ్వంసం సృష్టించారు. రైతులకు మేలు చేసే కన్నా కీడు చేసే కార్యక్రమానికి ఈ వైసీపీ అల్లరి మూకలు పొదిలిలో వీరంగం సృష్టించారు. ఐదేళ్ళ ముఖ్యమంత్రిగా ఉన్న జగన్మోహన్ రెడ్డి ఏనాడూ రైతుల సంక్షేమం గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. ఏ రోజు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎవరిని పరామర్శించలేదు అలాంటిది రైతుల పేరుతో పొదిలి వచ్చి రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న మహిళా ఉద్యమాన్ని నీరుగాచేందుకు బెదిరించేదుకు బీరు బాటిల్లతో తన పేటీఎం బ్యాచ్‌తో దాడి చేయించారు. తక్షణమే వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నాం అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు పోలీసులు చట్ట ప్రకారం ఎంతటి వారైనా మహిళల లను కించపరిస్తే వారిని అవమానిస్తే కఠినంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అయినా ముఖ్యమంత్రిగా చేసిన జగన్ రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కుంభకోణాల నుండి తప్పించుకునేందుకు ఇలాంటి కుట్రలు కుతంత్రాలకు తెరలేపారు. ప్రజా కోర్టులో ఇప్పటికే జగన్మోహన్ రెడ్డి శిక్ష అనుభవిస్తున్నాడు ఇక న్యాయస్థానంలో శిక్ష తప్పదు అని లక్ష్మీ జోష్యం చెప్పారు.

నేడు సజ్జాపురంలో మంత్రి గొట్టిపాటి పర్యటన

విశాలాంధ్ర - సంతమాగులూరు : మండలం లోని సజ్జాపురం గ్రామంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ గురువారం పర్యటి స్తారని టీడీపీ సంతమాగులూరు మండల క్లస్టర్-2 ఇన్‌ఛార్జ్ కంచేటి మురళి బుధవారం ప్రకటనలో తెలిపారు.ఆ రోజు ఉదయం 11గంటలకు గ్రామం లోని పలు అభివృద్ధి పనులు ప్రారంభోత్సవ కార్యక్ర మంలో పాల్గొంటారని చెప్పారు.బల్లికురవ-సంతమాగులూరు పరిధిలోని 3 కిలోమీటర్ల వరకు సజ్జాపురం రహదారిపై తారురోడ్డుగా రూ.1.20కోట్లతో అభివృద్ధి చేశారు. ఆ రహదారి శిలాఫలకాన్ని మంత్రి చేతులు మీదుగా ప్రారంభించడంతో పాటు గ్రామంలో నూతనంగా స్పౌజ్ పెన్షన్లకు ఎంపికైన 9మంది లబ్ధిదారులకు మంత్రి పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.కావున మండ లం పరిధిలోని కూటమి నేతలు, కార్యకర్తలు తరలిరావాలని ఆయన కోరారు.

గిట్టుబాటు కూలి కల్పించేలా ఉపాధి పనులు

విశాలాంధ్ర - ముండ్ల మూరు : ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులకు కూలీ లకు గిట్టుబాటు గా రోజువారి వేతనం 307 రూపాయలు వచ్చేలా చూడా లని ఉపాధి ఏపీవో టి వెంకట రావు అన్నారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో బుధవారం క్షేత్ర సహాయ కులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామపంచాయతీలో హార్టికల్చర్, ఫారం పాండ్లు, సుపరిపాలన అంశాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పని ప్రదేశాలలో తప్పని సరిగా నీడ వసతి, నీటి వసతి ఉండేలా చూడాలన్నారు. పని కల్పించడమే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీ శివరామకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ విజయోత్సవ ర్యాలీ

విశాలాంధ్ర - సింగరాయకొండ : తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా సింగరాయ కొండలోని పాకల రోడ్ నుంచి ఎన్.టి.ఆర్ సర్కిల్ వద్ద వరకు నేడు ర్యాలీ నిర్వహిం చడం జరుగుతుందని సింగరాయకొండ మండల నాయకులు బుధవారం ఒక ప్రత్యేక సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి వర్యులు డా, డోలా బాలా వీరాంజనేయ స్వామి మరియు రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పాల్గొంటారని, ముందుగా ప్రతి మండల హెడ్ క్వార్టర్ నందు 9 గంటలకు కేక్ కటింగ్ చేసి, అనంతరం ర్యాలీ ప్రదేశానికి విచ్చేయవలసిం దిగా మండల నాయకుల్ని కార్యకర్తలని తెలియజేయడమైనది. అదేవిధంగా నియోజక వర్గంలోని అన్ని మండలాల నాయకులు,అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా తెలిపారు.

అధైర్య పడొద్దు... అండగా ఉంటా

- చీరాల యువకుడికి భరోసా
- పీ4 కింద దత్తత తీసుకున్న డీఆర్డీఏ
- రూ.50 వేలు ఆర్థిక సాయం అందించిన కలెక్టర్

విశాలాంధ్ర - బాపట్ల : అధైర్య పడొద్దు.. అండగా నేనుంటా అంటూ జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి యువకుడికి భరోసా ఇచ్చారు. భర్త వదిలు యటంతో భార్య గ్రామ సమా ఖ్య సహాయకు రాలుగా పని చేస్తూ తన ఒక్కగానొక్క కుమారుడే తన సర్వస్వం అనుకంది. ఎన్నో కలలు కని ముం దుకు సాగుతున్న తరుణం లో అనారోగ్యం భారీన పడి మృత్యువు ఒడికి చేరు కుంది. దీంతో ఆ యువ కుడి జీవితం అంధకారంగా అగమ్యగోచరంగా మారింది. ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా తీసుకున్న పీ4 కార్యక్రమం ద్వారా దత్తత తీసుకుంది.

- బాపట్ల జిల్లా చీరాల మండలం హస్తినా పురం గ్రామానికి చెందిన పముజుల వెంకటశిరీష గ్రామ సమాఖ్య సహాయకురాలుగా పని చేస్తూ జీవ నం సాగిస్తుంది. భర్త వదిలేయడంతో కుమారుడే లోకమని భావించి అతని కోసం కొన్నేళ్లుగా ఒంటరి జీవితం కొనసాగిస్తోంది. ఇటీవల ఆమె అనారోగ్యం తో మృతి చెందారు. దీంతో ఈమెకు ఒక్కడే అయి ఉన్న కుమారుడు పవన్ నిశ్చేస్టుడిగా మిగిలిపో యాడు. తల్లి మృతితో పవన్ ఏకాకిగా మిగిలాడు. పవన్ బాపట్లలోని ఓ ఇంజినీరింగ్ కాలేజీలో ఫోర్త్ ఇయర్ చదువుతున్నాడు. ఉన్నత శిఖరాలకు ఎద గాలని ఆశించిన తన కలలన్నీ నిరాశలయ్యాయి. అలాంటి సమయంలో పవన్ కు డిఆర్డిఏ బాసటగా నిలిచింది. పవన్ ఉన్నత చదువులకోసం చేయూత నందించాలని నిర్ణయించింది. వెనువెంటనే పీ4 కింద దత్తతకు తీసుకుంది. చీరాలకు చెందిన గ్రామ సమాఖ్య సభ్యులంతా కలిసి అతనికి తమ వంతు సహాయంగా రూ.50 వేలను జిల్లా కలెక్టర్ వెంకటమురళి అందజేశారు.

ఆర్థిక సాయం అందించిన కలెక్టర్...

యువకుడు పవన్ గురించి తెలుసుకున్న కలెక్టర్ స్పందించారు. ఎప్పుడైనా ఎటువంటి కష్టం వచ్చినా తనను కలవవచ్చని కలెక్టర్ వెంకటమురళి భరోసా ఇచ్చారు. జిల్లాలో మొట్ట మొదటి సారిగా యువకుడ్ని డిఆర్డిఏ దత్తతకు తీసుకోవడంపై డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావును, సిబ్బం దిని జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

పేద, బడుగు, బలహీన వర్గాలకు అండ సీపీఐ

విశాలాంధ్ర - సిఎస్ పురం : పేద బడుగు బలహీన వర్గాల పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని సీపీఐ మండల కార్యదర్శి ఎస్ కే వై పెదమస్తాన్ అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ మండలంలోని కందుల కె.అగ్రహారం గ్రామ యస్టి కాలని శాఖ మహాసభ మేకల అంకయ్య ఆధ్యక్షత బుధవారం జరిగింది. ఈ మహసభకు ముఖ్య అతిథిగా మం డల ప్రధాన కార్యదర్శి యస్ కే వై పెద మస్తాన్ హాజరయ్యారు. ఈ సమావేశంలో మస్తాన్ మాట్లా డుతూ భారత కమ్యూనిస్ట్ పార్టీ పేద బడుగు బల హీనులకు ఆండగా మన దేశం స్వాతంత్రంవచ్చిన తరువాత నాటి నుండి నేటి వరకు పెద బడుగు బలహీన వర్గాల శ్రేయస్సు కోసం చేసిన ఆనేక పోరాటాలు ఫలితంగా కార్మికులకు కర్షకులకు ఎన్నో చట్టాలు తీసుక వచ్చిందని, ఆచట్టాల ఫలితంగా దేశంలో పెద బడుగు బలహీనవర్గాలు స్వేచ్ఛ రక్షణ కల్పిస్తు న్నాయి. దేశంలో రాష్ట్రంలో ఎన్ని పార్టీలు ఆధి కారం వచ్చిన పేదల నివసించుటకు మూడు పూటలు తిండి లేని కుటుంబాయి దేశంలో రాష్ట్రం లో లక్షలాది కుటుంబాలు ఉన్నాయి ఆనీ అధికా రానికి రాకముందు అమలు కానీ హామీలు రాష్ట్రా ప్రజలకు హామీలు ఇచ్చి ప్రభుత్వము ఆధికారం లోకి వచ్చి సవత్సరం కాలం అయిన ఎ ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. కావున ప్రభుత్వం వెంటనే పెరిగిన కరంటు గ్యాస్ నిత్యవసర సరు కులు తగ్గించి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు ఆమలు చేయాలన్నారు. పార్టీ నేటి కి 100 సంవత్సరాలు అయిన సందర్భంగా జిల్లా మహాసభలు జూన్ 21, 22.23న దర్శిలో రాష్ట్రా మహాసభలు ఆగష్టు 23, 24, 25న ఒంగోలులో జరుగుతున్నాయని పార్టీ నాయకులు కార్యకర్తలు సానుభూతిపరులు ఆధిక సంఖ్యలో హాజరై ఆగష్టు 23 ర్యాలీ బహిరంగ సభను విజయవంతం చేయా లని కోరారు. ఈ కార్యక్ర మంలో సహాయ కార్యదర్శి ఎస్ కే వై మౌలాలి కళ్యానీ స్వప్న అల్లారమ్మ గురవమ్మ నారయణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పోరుబాటకు భారీగా తరలిన వైసీపీ శ్రేణులు

విశాలాంధ్ర - పొన్నలూరు : రాష్ట్రంలోని పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని మాజీ సీఎం జగన్ ఆధ్వర్యంలో పొదిలి పట్టణంలో చేపట్టిన జగనన్న రైతు పోరుబాట కార్యక్రమానికి పొన్నలూరు మండలంలోని అన్ని గ్రామాల నుంచి వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్య కర్తలు, రైతులు, ఆ పార్టీ మండల కన్వీనర్ దుద్దుగుంట మల్లికార్జున రెడ్డి, జడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు ఆధ్వ ర్యంలో బుధవారం భారీ గా తరలివెళ్లారు. కార్లు ఆటోలు, బైకులపై సుమా రుగా 1500కు మందికి పైగా తరలివెళ్లి రైతు పోరుబాటకు మద్దతు తెలి పారు. వెళ్లిన వారిలో ఎం పీపీ కొండా బత్తిన మాధ వరావు, వైసీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్య దర్శి సిరిగిరి గోపాలరెడ్డి, నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు పల్నాటి వెంక టేశ్వర రెడ్డి, జిల్లా కార్యనిర్వాహణ, కార్యాచరణ కార్యదర్శులు మన్నెం చిన్న వెంకటేశ్వర్లు, కాటా మాధవరావు, జిల్లా అంగన్‌వాడీ విభాగం అధ్యక్షు రాలు కనపర్తి గోవిందమ్మ, వైసీపీ మండల ఉపాధ్యక్షులు కాటా మల్లికార్జున రావు, గద్దం మాల్యాద్రి, పల్లపోలు బాలకోటిరెడ్డి, పిల్లి తిరుపతిరెడ్డి గ్రామంలోని నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన దామచర్ల

విశాలాంధ్ర - ఒంగోలు : నగరంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు బుధవారం పలుఅభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఒంగోలు నగర పరిధిలోని త్రోవ గుంట వద్ద ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏరువాక కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం, ఒంగోలు పొగాకు వేలం బోర్డు2లో పొగాకు వేలం తీరు ను మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి పరిశీలిం చారు. అనంతరం నగరం లోని 18 డివిజన్లో వెంగముక్కపాలెం రూ.54లక్షల నిర్మించనున్న సీసీ డ్రైన్‌కు శంకుస్థాపన చేశారు. 15వ డివిజన్ పరిధిలోని అగ్రహారం గేటులో 48 లక్షల రూపాయలతో నిర్మించిన సిసి డ్రైన్‌ను ప్రారంభించారు. 46వ డివిజన్లోని అంజయ్య రోడ్డులోని సూర్య బలిజ ఆరామ క్షేత్రం మొదటి అంతస్తు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. 46వ డివిజన్ లో 37 లక్షల రూపాయలతో నిర్మించడం సిసి డ్రైన్కు శం కు స్థాపన చేశారు. పాతప ట్నం మండలం రంగాయి పాలెం గ్రామంలో 90లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఒం గోలు మండలం ఎర్రజర్ల గ్రామంలో 1.10 కోట్లతో నిర్మిం చిన సీసీ రోడ్లను ప్రారంభించారు. నగరంలోని ప్రభుత్వ సర్వజన విద్యాసాలలో తల్లి, ప్రత్యేక నవ జాతి శిశుసంరక్షణ కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే సంఘ మిత్ర హాస్పిటల్ బైపాస్ ఎంట్రన్స్ వద్ద రూ.7 లక్షల నిర్మించిన ఫైబర్ విగ్రహాన్ని ప్రారం భించారు. అనంతరం కొత్తపట్నం బస్టాండు వద్ద రూ.10 లక్షలతో నిరూపించిన సిసి రోడ్లను ప్రారంభించారు.